సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 25 । మార్చి । 2023



గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న 11 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో..

శవమై తేలిన పశుసంవర్ధక డీడీ అచ్చెన్న



పశుసంవర్ధకశాఖలో కడప వెటర్నరీ పాలీక్లినిక్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ అచ్చెన్న మృతదేహం అన్నమయ్య జిల్లా రామాపురం పీఎస్ పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో లభ్యమైంది. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5/25.4

జిల్లాలో శుక్రవారం 25.4 – 37.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
కడప	6.30	5.01
ప్రొద్దుటూరు	6.28	5.05
పులివెందుల	6.33	5.06

రూ.569.46 కోట్లతో
నగరపాలక బడ్జెట్

నేడు ఆమోదించనున్న సర్వసభ్య సమావేశం

కడప కార్పొరేషన్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.569.46కోట్లతో నగరపాలక బడ్జెట్ రూపొందించారు. శనివారం కడప మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశంలో నగరపాలక సభ్యుల సలహాలు, సూచనల అనంతరం దీనిని ఆమోదించనున్నారు. 2022–23 సంవత్సరంలో రూ.597.23కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా సవరించిన అంచనాల ప్రకారం రూ.228.65కోట్లుగా తేలింది. మొత్తం ఖర్చులు రూ.196.82కోట్లు కాగా మిగులు నిల్వ రూ.31.83 కోట్లు ఉంది. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ, క్యాపిటల్ మొత్తం జమలు రూ.537.62 కోట్లకు గాను, మొత్తం ఖర్చులు రూ.536.59 అవుతాయని, మిగులు రూ.32.82కోట్లుగా అంచనా వేశారు. ఇందులో అభివృద్ధి పనులకు రూ.24.71 కోట్లు, ఎస్సీలకు రూ.4.30కోట్లు, ఎస్టీలకు రూ.1.63 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం కోసం రూ.1.23కోట్లు, వికలాంగుల సంక్షేమానికి రూ.74.13లక్షలు కేటాయించారు. మొత్తం నికర నిధులు రూ.24.71కోట్లలో 40 శాతం నిధులను మురికి వాడల అభివృద్ధికి కేటాయించనున్నారు.

- రెవెన్యూ ఆదాయం రూ.132.72కోట్లు వస్తుందని, 131.69కోట్లు ఖర్చవుతుందని, క్యాపిటల్ అకౌంట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.404.89కోట్లు వస్తాయని, అంతే నిధులు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఆస్తిపన్ను ద్వారా రూ.43.74కోట్లు, నీటి పన్ను ద్వారా రూ.11.10కోట్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.25కోట్లు, ట్రేడ్ లైసెన్సులు, పార్కుల ప్రవేశ రుసుము, డెబ్రిస్ రిమూవల్ ఫీజు, యూజర్ చార్జీలు, జనన, మరణ నమోదు ఫీజుల ద్వారా రూ.9.08కోట్లు, రోడ్డు కటింగ్ చార్జీలు, టెండరు షెడ్యూల్ అమ్మకం, కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ ఫీజులు, ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా రూ.3.38కోట్లు వస్తాయని అంచనా వేశారు.



- కొత్త లే ఔట్లు, ప్లాట్ల సబ్ డివిజన్ ద్వారా, బిల్డింగ్ లైసెన్స్ ఫీజులు, డెవలప్‌మెంట్ చార్జీలు, ప్రైవేటు ఖాళీ స్థలాలపై పన్ను, ప్రకటనల పన్ను, ఆక్యుపెన్సీ, ఇంపాక్ట్, పీనలైజ్ చార్జీల రూపంలో రూ.23.95కోట్లు, మార్కెట్, షాపు రూముల బాడుగలు, ఆడిటోరియం, కళాక్షేత్రం బాడుగలు, మ్యూటేషన్ ఫీజులు, షాపు రూముల ద్వారా వచ్చే గుడ్‌విల్ ద్వారా రూ.11.27కోట్లు రాగలవని ప్రతిపాదించారు.



కడప నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్)

పెరిగిన ఖర్చులు

2022–23 ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన దాని కంటే ఖర్చులు పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా అదే రీతిలో పెరుగుతాయని అంచనా వేశారు. టెలిఫోన్, సెల్ కాన్ఫరెన్స్‌ల కోసం రూ.20లక్షలు అంచనా వేయగా రూ.57.73లక్షలు ఖర్చయ్యాయి. ప్రకటన ప్రచార ఖర్చులు రూ.30లక్షలు అంచనా వేయగా, రూ.95.52లక్షల వ్యయమైంది. చెత్త డబ్బాలు, క్లాప్ యూజర్ చార్జీల కోసం రూ.3.29కోట్లు వెచ్చించారు. రోడ్లు, కాలువల నిర్వహణకు రూ.51లక్షలు,నగర సుందరీకరణకు రూ. 51.42లక్షలు వినియోగించారు. మొత్తం మీద 2022–23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఖర్చులు రూ.97.73కోట్లు అవుతాయని ప్రతిపాదించగా,ఐదుకోట్లు అదనంగా రూ.102.71కోట్లు ఖర్చయ్యాయి. 2023–24 సంవత్సరంలో రూ.131.69కోట్లు ఖర్చు కాగలవని అంచనా వేశారు.

ఉదయం 9.30గంటలకే సమావేశం

నగరపాలక సంస్థ కార్పొరేటర్లు మధ్యాహ్నం నుంచి ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొనేందుకు సిమ్లా పయనం కావాల్సిన నేపథ్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకే బడ్జెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో 11 గంటలకు ప్రారంభించి, భోజన విరామం తర్వాత కూడా నిర్వహించేవారు. ప్రస్తుతం మధ్యాహ్నానికే ముగించనున్నట్లు తెలిసింది.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు
నెలాఖరుకు పూర్తి చేయాలి

టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు మార్చి 31 తేదీ నాటికి పూర్తి చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. కల్యాణ వేదిక ప్రాంగణంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిహార్సల్స్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులు ఆయా ఇన్‌చార్జులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే తయారు చేస్తుకున్న కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. డిప్యూటేషన్ సిబ్బంది, శ్రీవారి సేవకులు, హెల్ప్ డెస్కుల ఏర్పాటు, వసతి, తలంబ్రాల తయారీ, అన్నప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్యం, రవాణా ఇంజనీరింగ్ పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఏప్రిల్ 5వ తేదిన జరిగే శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆయన చెప్పారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని, వీఐపీలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి: జేసీ

జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ..వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర పండుగగా జరుపుతున్న శ్రీ కోదండ రామస్వామి కల్యాణాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని చెప్పారు అనంతరం జేఈవో, జాయింట్ కలెక్టర్ కలిసి ఏప్రిల్ 5వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల కాన్వాయ్ ఎంతవరకు రావాలి, కల్యాణ వేదికపై సీఎం, వీఐపీల సీటింగ్ తదితర ఏర్పాట్ల గురించి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. అనంతరం జేఈవో, జాయింట్ కలెక్టర్ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్పీ తుషార్ డూడీ, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ

న్యూస్‌రీల్

27న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈనెల 27వ తేదీన ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్, కొప్పర్తిలో ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ సొల్యూషన్ సెంటర్ మేనేజర్ యూసఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగానికి బీటెక్‌లో ఈసీఈ, ట్రిపుల్ ఈ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. డిప్లొమా ఇంజినీర్ ఇన్ ట్రైనీ ఉద్యోగానికి డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇతర వివరాలకు 70954 99870, 8106 059836 నంబర్లలో సంప్రదించాలన్నారు.

675 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 675 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 92 పరీక్షా కేంద్రాల్లో 19895 మంది విద్యార్థులకు గాను 19220 మంది హాజరయ్యారు. ఆర్ఐవో రమణరాజు వైఎస్సార్‌జిల్లా పొద్దుటూరులోని ఓ పరీక్షా కేంద్రంలో ముగ్గురిని, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు జమ్మలమడుగు పరీక్ష కేంద్రంలో నలుగురిని, మైదుకూరు, పోరుమామిళ్ల, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఒక్కొక్కరి చొప్పున విద్యార్థులను డీబార్ చేశారు. ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

మహిళల క్రికెట్ జిల్లా సమన్వయకర్త నియామకం



విష్ణుమోహన్‌రావు

కడప స్పోర్ట్స్: మహిళల క్రికెట్ జిల్లా సమన్వయకర్తగా కల్యాణదుర్గం విష్ణు మోహన్‌రావును నియమిస్తూ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం కడపలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ కార్యాలయంలో నిర్వహించిన అపెక్స్ సమావేశంలో ఈయనను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుమోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో మహిళల క్రికెట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఆయనకు క్రికెట్ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగేష్ కుమార్‌రాజు, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజా మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నందవరానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నంద్యాల జిల్లా నందవరంలో వెలసిన చౌడేశ్వరీ దేవస్థాన జ్యోతుల ఉత్సవాలకు కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కమలాపురం నుంచి శనివారం ఉదయం 10 గంటలకు ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు కోవెలకుంట్ల, బనగానపల్లె మీదుగా నందవరానికి సర్వీసు బయలుదేరుతుందన్నారు.అలాగే ఖాజీపేట నుంచి మధ్యాహ్నం 3 గంటలకు మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బనగానపల్లె మీదుగా, కడప నుంచి సాయంత్రం 5.30 గంటలకు మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బనగానపల్లె మీదుగా బస్సులు నందరానికి చేరుతాయన్నారు. ఈ బస్సులు తిరుగు ప్రయాణంలో ఆదివారం ఉదయం 8గంటలు, 10 గంటలకు, మధ్యాహ్నం 1.00 గంటకు నందవరం నుంచి బయలుదేరతాయన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సంబంధిత లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహ హక్కు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలన్నారు.

- జిల్లాలో తాగునీటి సరఫరాతో పాటు పారిశుద్ధ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు.జేసీ సాయి కాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

- వైఎస్సార్ జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యులు అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినపుడే మాతృ శిశు మరణాలను అరికట్టగలమని సూచించారు. సమావేశానికి కలెక్టర్‌తోపాటు డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజులు హాజరయ్యారు.
- గండికోట ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ అండ్‌ఆర్‌లోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్, కమ్యూనిటీ బిల్డింగ్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్టు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థిని

కడప ఎడ్యుకేషన్: కడప చెమ్ముమియాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌కు చెందిన షేక్ ఫైజా సుల్తానాకు చెందిన ప్రాజెక్టు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు జరిగాయి. ఇందులో కడప చెమ్ముమియాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌కు చెందిన షేక్ ఫైజా సుల్తానా ''ఫెడల్ ఫ్రీ హ్యాండ్లూమ్'' అనే ప్రాజెక్టు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. విద్యార్థిని, గైడ్ టీచర్ సోఫియా, హెచ్ఎం మేరీని డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి అభినందించారు.

దస్తూరి.. మార్కుల సిరి

- చక్కని రాత.. మారుస్తుంది భవిత
- సాధన చేయాలంటున్న నిపుణులు





పరీక్షలకు సిద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఇప్పటి వరకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సబ్జెక్టులను మాత్రమే చదువుతూ ముందుకు వెళ్తున్నారు. చదువుతోపాటు దస్తూరిపైనా దృష్టి సారిస్తే చక్కటి మార్కులు మీ సొంతమంటున్నారు నిపుణులు. అక్షర దోషాలు, గజిబిజి చేతిరాత వల్ల ఒకటి,రెండు మార్కులు కోల్పోయే అవకాశం ఉంది.సమాధాన పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయుడికి మంచి దస్తూరి కనిపిస్తే ఆ ప్రభావం ఆయన వేసే మార్కులపై సానుకూలంగా ఉంటుంది. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ క్రమంలో చక్కటి దస్తూరితో పరీక్షలు రాస్తే మంచి మార్కులు అందుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాలను మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రతి రోజూ కొద్ది సేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు. పెన్‌టిప్‌ను దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు గుండ్రంగా వచ్చే అవకాశం ఉంటుంది.

- జవాబులను సూటిగా రాయాలి
- మనం రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దేవారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు
- వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి
- దిద్దుబాటు. గజిబిజి ఉండకూడదు. పదానికి పదానికి మధ్య దూరం ఉండాలి
- చేతి రాత గుండ్రంగా, అర్థమయ్యేలా ఉండాలి

ఇలా రాస్తే మంచిది...

- ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకోవాలి. తర్వాత రాయాలి.
- సమాధాన పత్రంలో పేజీకి 15– 16 లైన్లు ఉండాలి.
- పేజీకి పైన కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి వరుసలో ఎంత బాగా రాసారో చివరి వరకు అదే దస్తూరి కొనసాగించాలి
- తెలుగు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి
- అక్షర దోషాలు, దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి
- గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి, కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గుతాయి. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి
- సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి
- సాంఘికశాస్త్రం సబ్జెక్టుల్లో సమాధానాలను పాయింట్లవారీగా రాయాలి. శీర్షికలు, ఉపశీర్షికలు కింద అండర్ లైన్ చేయాలి.


యాజమాన్యం	పాఠశాలలు	రెగ్యులర్	ప్రైవేటు	మొత్తం
ఎయిడెడ్	25	868	110	978
బీసీ వెల్ఫేర్	04	188	01	189
గవర్నమెంట్	10	674	51	725
కేజీబీవీ	17	592	02	594
మున్సిపాలిటీ	17	1752	223	1975
మోడల్	03	263	01	264
ప్రైవేటు	291	12363	212	12575
ఏపీఆర్ఎస్	03	159	01	160
సోషల్ వెల్ఫేర్	13	835	11	846
ట్రైబల్ వెల్ఫేర్	05	104	04	108
జెడ్పీ	202	9509	457	9966
మొత్తం	589	27307	1073	28380

- మంచి పెన్నులను ఉపయోగించాలి. అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి

విద్యార్థులు చేసే పొరపాట్లు..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా ఉంటే జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16–18 లైన్లకు మించకూడదు.లైన్లు సమాంతరంగా ఉండాలి. చాలా మంది విద్యార్థులు ఒత్తిపట్టి రాస్తుంటారు. పెన్నును వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబుపత్రం గజిబిజిగా తయారవుతుంది. కొందరు అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లిషు జెడ్ తరహాలో, 5ను ఎస్ తరహాలో, 0ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి.

మూల్యాంకనంలో ప్రాధాన్యం...



మంచి దస్తూరికి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. తప్పులు, కొట్టి వేతలు లేకుండా రాయాలి. చేతిరాతపై సాధన చేయాలి. సమాధానాలు అర్థమయ్యేలా రాయాలి.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

అదనపు మార్కులకు అవకాశం..



అందమైన చేతిరాత మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది బాగా చదువుతారు. కానీ సరిగా రాయకపోవడంతో అనుకున్న మార్కులు సాధించలేకపోతున్నారు. అందువల్ల చిన్న వయసునుంచే దస్తూరిపై దృష్టి సారిస్తే మంచిది. విద్యార్థుల తల్లితండ్రులు కూడా ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.
-రాఘవరెడ్డి, డీఈఓ

సాధనతోనే గుండ్రటి అక్షరాలు సాధ్యం



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. విద్యార్థులు అక్షరాలను అందంగా రాసేందుకు సమయం కేటాయించాలి. దస్తూరి చదవడానికి వీలుగా ఉండాలి. పదానికి పదానికి మధ్య ఖాళీస్థలం ఉండాలి. మార్జిన్‌లో ప్రశ్న నంబర్‌ను స్పష్టంగా రాయాలి. ముఖ్యమైన పాయింట్లను, సైడ్ హెడ్డింగ్‌లను అండర్‌లైన్ చేయాలి. ముఖ్యంగా కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
– పవన్‌కుమార్, చేతిరాత నిపుణుడు, కడప

రేపు బీసీ జనగణనపై సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బీసీ జనగణనపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మి నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం సమాఖ్య కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాశీం, జాతీయ బీసీ జేఏసీ నాయకుడు వలిగట్ల రెడ్డెప్ప, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, సామాజిక కార్యకర్త మల్లెల భాస్కర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య నేతలు సందు శివనారాయణ, రాజు, గురప్ప, కృష్ణయ్య ఆనంద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

27న గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం ప్రదర్శన


నిరంతక్ కృష్ణ

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్(ఐడీపీఎస్) ఆవరణలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కోసం ఈ నెల 27న ఆ స్కూల్‌కు చెందిన 10 ఏళ్ల బాలుడు ప్రదర్శన నిర్వహించనున్నారు. నిరంతక్ కృష్ణ నిమిషం వ్యవధిలో నూటికి పైగా దేశాలను గుర్తించటంతోపాటు వాటి పేర్లను చెప్పనున్నాడు. ఈ ప్రదర్శనలో విజయం సాధించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చేరనున్నట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఇప్పటికే నిరంతక్ కృష్ణ ఈ ప్రక్రియ ద్వారా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, స్టార్ కిడ్ అచీవర్, ఇండియన్ ప్రైమ్ ఐకాన్, విజన్–27 రికార్డ్సును సొంతం చేసుకున్నాడని పాఠశాల చైర్మన్ లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.

రంజాన్ వేళలు.. రూపుదిద్దుకున్న వేళ

రాజంపేట టౌన్ : ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈమాసంలో వారు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేపడుతారు. ఉపవాసం చేపట్టే, విరమించే సమయాన్ని వారు విధిగా పాటిస్తారు. ఎందుకంటే సహర్, ఇఫ్తార్‌ల సమయం కంటే ముందు గానీ, ఆలస్యంగా కానీ ఉపవాసం చేపట్టడం, విరమించడం చేస్తే.. ఆ రోజు చేపట్టే ఉపవాస దీక్షకు సార్థకత ఉండదన్నది వారి భావన. అందువల్ల సహర్, ఇఫ్తార్‌లను సరైన సమయంలోనే పూర్తి చేస్తారు.

గతంలో ఎలా చేసే వారంటే..

ఉపవాస దీక్షలు చేపట్టే వారు సహర్, ఇఫ్తార్ వేళలను తెలుసుకునేందుకు ఇప్పుడు కార్డులు అందుబాటులోకి వచ్చాయి. అయితే పూర్వం ఇలాంటి సౌకర్యం ఉండేది కాదు. అందువల్ల సహర్, ఇఫ్తార్ వేళలు తెలియ చేసేందుకు ఆయా ప్రాంతాల్లోని మతపెద్దలు తూటాలను పేల్చేవారు. ఆ తరువాత కాలానుగుణంలో వచ్చిన మార్పుల కారణంగా సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే విధానంలో మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. టపాసులు అందుబాటులోకి వచ్చాక టపాసులను పేల్చే వారు. ఆ తరువాత మైక్‌లు అందుబాటులోకి వచ్చాక మసీదుల్లోని మైక్‌ల ద్వారా మౌజన్‌లు ఉపవాసం ప్రారంభానికి ఒక గంట ముందు రోజేదారో ఉఠో.. ఉఠో (ఉపవాస దీక్ష చేపట్టేవారు లేవండి) అంటూ చెబుతున్నారు. ఇక ఉపవాస దీక్ష ఉపసంహరించే సమయాన్ని కూడా అర్ధగంట నుంచి తెలియ చేస్తున్నారు. అయితే మసీదులకు సమీపంలో లేని వారు సైతం సహర్, ఇఫ్తార్ వేళలు పాటించడం కోసం స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ధనవంతులు సహర్, ఇఫ్తార్ వేళలను తెలియజేసే కార్డులను ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద సెల్‌ఫోన్‌లు అందుబాటులో ఉండటంతో.. ఆ పట్టికను ఫొటోతీసి తమ సెల్‌ఫోన్‌లలో భద్రపరుచుకుంటున్నారు.


సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే కార్డు

సమయ నిర్ధారణ పట్టిక ఎలా తయారైందంటే..

పూర్వం రంజాన్ మాసంలో ఉపవాసం ప్రారంభం, విరమణ సమయాల విషయంలో ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఫ్తీ మహమ్మద్ రహీముద్దీన్ అబ్దుల్ వాసే ఉపవాస ప్రారంభ, విరమణ సమయ నిర్ధారణ పట్టిక తయారు చేయాలని నిర్ణయించారు. ఈయన ప్రపంచం మొత్తం ఉపవాస దీక్ష పాటించే సమయ పట్టికను 290 పేజీల పుస్తకం ×మియారుల్ ఔకాత్®లో పొందుపరిచారు. ఇప్పటికీ ఈ పుస్తకం ఆధారంగానే ఉపవాస పట్టికను నిర్ధారిస్తున్నారు. ఈ పుస్తకం ఆధారంగా 1968లో తొలిసారిగా ఉపవాస పట్టిక తయారైనట్లు ముస్లింలు చెబుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే సరికి సహర్, ఇఫ్తార్ వేళల్లో కొన్ని నిమిషాల తేడాతో సమయ పట్టికను రూపొందించారు. అందువల్ల ఒక పట్టణానికి మరో పట్టణానికి రెండు, మూడు నిమిషాల తేడాతో సహర్, ఇఫ్తార్ వేళలు ప్రారంభం అవుతాయి.

కార్డుల వల్ల విధిగా సమయ పాలన



"సహర్, ఇఫ్తార్ వేళలు తెలియచేసే కార్డుల వల్ల ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమయానికి సహర్, ఇఫ్తార్ వేళలను పాటించేందుకు వీలవుతుంది. కార్డులు అందుబాటులోకి రాక ముందు సహర్, ఇఫ్తార్ వేళలను ఇతరులను అడిగి తెలుసుకోవాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ సమస్య లేదు.
– ఎస్.షామీర్‌బాషా, ప్రెసిడెంట్, కూబామసీదు, రాజంపేట

బెంగళూరుకు వారాంతపు బస్సు సర్వీసుల పెంపు


జిల్లా ప్రజా రవాణా అధికారి రాము

మదనపల్లె సిటీ : బెంగళూరుకు వారాంతంలో బస్సు సర్వీసులు పెంచనున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి పి.రాము అన్నారు. శుక్రవారం స్థానిక వన్, టు డిపో కార్యాలయాలు, డిపో గ్యారేజీ, బస్సులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నుంచి సోమవారం వరకు అదనంగా సర్వీసులు నడుపుతామన్నారు. హైదరాబాదుకు రెండు స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సులు వచ్చాయన్నారు. స్పెషల్ బెర్తులు ఉంటాయన్నారు. త్వరలో బస్సు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. వన్‌డిపో ఆవరణంలోని పెట్రోల్ బంకు పనులు పూర్తికాగానే ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంటి నుంచి పరీక్షా కేంద్రాలకు వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లు చూపించాలన్నారు. కార్యక్రమంలో 1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు. టు డిపో పరిధిలో ఈపీకే, కేఎంపీఎల్ అధికంగా తెచ్చిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

నిమ్మనపల్లె : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మదనపల్లె కోర్టులో న్యాయమూర్తి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు. ఈ నెల 19న మండలంలోని పిట్టావాండ్లపల్లె వద్ద ఎస్‌ఐ ఫాతిమా సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మద్యం సేవించి తిరుపతికి చెందిన యుగంధర్ వాహనం నడుపుకొంటూ వచ్చాడు. పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, యుగంధర్ మద్యం సేవించినట్లు గుర్తించి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఫలితాల్లో తాగినట్లు తేలడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని ఈ నెల 24న కోర్టులో హాజరుపరిస్తే న్యాయమూర్తి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో 11 మంది నిందితులు
- 23.96 కిలోల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న 11 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 23.95 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కడపలోని ×పెన్నార్® పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు, మైదుకూరు అర్బన్ పరిధిలో నలుగురు, అట్లూరు పరిధిలో ఇద్దరు, పులివెందుల పరిధిలో ఒకరు చొప్పున గంజాయి నిందితులను అరెస్ట్ చేశారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసిన వారితోపాటు చిన్న చిన్న పొట్లాల్లో విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో మైదుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కొరియం శ్రీనివాసులు, సయ్యద్ మౌలాలీ, షేక్ హసన్, పులివెందుల టౌన్‌కు చెందిన దుగ్గనపల్లి బాబ్జీ, ప్రొద్దుటూరు త్రీటౌన్ పరిధిలో హనుమసాని వెంకట శివ సురేష్, దొర్నపాటి దుర్గాసాయి, ఎస్.శ్రీనివాసులు, పవన్, పులివెందుల పీఎస్ పరిధిలో పులివెందుల టౌన్‌కు చెందిన ఎం. శంకర్, అట్లూరు పీఎస్ పరిధిలో కమ్మం మురళీ కృష్ణారెడ్డి, తొతుకు లక్ష్మీ ఉన్నారు.

పి.డి.యాక్ట్ ప్రయోగిస్తాం : ఎస్పీ

పదే పదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై పి.డి.యాక్ట్ ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. గంజాయిని వినియోగిస్తున్న వారికి రిహాబిలిటేషన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 56 మందికి ఇప్పించామన్నారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా వుంచామని చెప్పారు. యాంటీ డ్రగ్ కంట్రోల్ టీమ్‌లను విద్యార్థుల చేతనే ఏర్పాటు చేయించి ఎవరైనా విద్యార్థులు పెడదోవ పడుతున్నారా? అనే విషయాలపై నిఘా వుంచామన్నారు. గంజాయి, విక్రయాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100 లేదా తన ఫోన్ నంబర్: 94407 96900కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని వివరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పర్యవేక్షణలో గంజాయి ముఠాని అరెస్ట్ చేసిన ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ వంశీధర్‌గౌడ్, ఎస్‌బీ సీఐ రాజా ప్రభాకర్, మైదుకూరు అర్బన్ సీఐ చలపతి, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ నారాయణయాదవ్, పులివెందుల అర్బన్ సీఐ రాజు, బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

శవమై తేలిన పశుసంవర్ధక డీడీ అచ్చెన్న

- అదృశ్యం కేసుపై వీడిన మిస్టరీ
- గువ్వలచెరువు ఘాట్‌లో మృతదేహం లభ్యం
- పోలీసులు లోతుగా దర్యాప్తు


డాక్టర్ అచ్చన్న (ఫైల్)

కడప అర్బన్/రామాపురం : పశుసంవర్ధకశాఖలో కడప వెటర్నరీ పాలీక్లినిక్(వీపీసీ)లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ అచ్చెన్న అదృశ్యం కేసుపై మిస్టరీ వీడింది. ఆయన మృతదేహం అన్నమయ్య జిల్లా రామాపురం పీఎస్ పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో లభ్యమైంది. ఈ సంఘటనపై ఒకవైపు రామాపురం పోలీసులు, మరోవైపు కడప ఒన్‌టౌన్ పోలీసులు పరస్పరం విచారణ చేస్తున్నారు. కాగా ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయారని అతని కుమారుడు, కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ క్లింటన్ చక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆధ్వర్యంలో ఈ నెల 15న అదృశ్యం కేసును నమోదు చేసి దర్యాప్తు కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించారు.

ఆది నుంచి వివాదాల్లో..

కడప వీపీసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న అచ్చెన్న, సిబ్బంది మధ్య గతేడాది నవంబర్ నెలలో వివాదం ప్రారంభమైంది. డీడీ అచ్చన్న తన కింద పని చేసే ఒక ఏడీ పనితీరు సరిగా లేదని రాష్ట్రశాఖకు సరెండర్ చేశాడు. కింది స్థాయి ఉద్యోగులను సరెండర్ చేసే అధికారం డీడీ అచ్చన్నకు లేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు కమిటీని ఆదేశించారు. ఆ కమిటీ విచారణ చేసి నివేదికలను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు డీడీ అచ్చన్నను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కడప వీపీసీలో పని చేసే మరో ఏడీకి డీడీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సదరు ఉత్తర్వులపై డీడీ అచ్చన్న కోర్టుకు వెళ్లి యథాస్థానంలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అక్కడి నుంచి వీపీసీలో వివాదం ప్రారంభమైంది. ఆ తరువాత అచ్చన్న వీపీసీలో పని చేసే మరో ఏడీ, డాక్టర్ పనితీరు సరిగా లేదని వారిద్దరిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తరువాత మరో ఏడీతోపాటు కార్యాలయంలో పని చేసే ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల పనితీరు కూడా సరిగా లేదని వారిని కూడా సరెండర్ చేశారు. ఇలా మొత్తం ఐదుగురిని సరెండర్ చేశాడు. దీంతో వారంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ విషయమై రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణ చేసి అచ్చెన్నను ఈ నెల 15వ తేదీన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఎఫ్‌ఏసీ డీడీగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ బాధ్యతలు చేపట్టేలా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆమె ఎఫ్‌ఏసీ డీడీగా బాధ్యతలను చేపట్టారు.

ఏమైంది? : తరువాత డీడీ అచ్చెన్న కనిపించడం లేదని కుటుంబ సభ్యులు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో శవమై తేలడంతో ఏమి జరిగిందనేది అంతు చిక్కడం లేదు. సెల్‌ఫోన్ స్విచాఫ్ రావడంతో ఎవరైనా గిట్టని వాళ్లు కిడ్నాప్ చేశారా? లేక వ్యక్తిగతంగా వెళ్లారా? అనే విషయాలపై వారు ఆరా తీస్తున్నారు. ఎట్టకేలకు అదృశ్యమైన దాదాపు 12 రోజులకు ఆయన మృతదేహం లభించడంతో కుటుంబం, బంధువుల్లో విషాదం నెలకొంది. ఇంకా ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, కార్మికులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ కడప రీజినల్ ప్రెసిడెంట్ నాగమని, సంయుక్త కార్యదర్శులు రహమతుల్లా, దాస్ కోరారు. శుక్రవారం కడప రీజియన్ వ్యాప్త ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎర్రబ్యాడ్జీలతో కడప గ్యారేజ్ ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల డిపో డ్రైవర్, కండక్టర్లకు ఫిక్స్‌డ్ చార్టు వేయాలన్నారు. ఏకపక్షంగా పెట్టిన ఆర్డినరీ, ఓఎంఎస్ సర్వీసులను రద్దు చేయాలన్నారు. సంస్థ నిబంధనలు పాటించకుండా అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులను వేధిస్తున్న మైదుకూరు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అర్హతల మేరకు సిక్ జీతాలను మంజూరు చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నైట్ అవుట్ అలవెన్సులు, ఓటీ డబ్బులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, ప్రెసిడెంట్ జయరాం, కోశాధికారి టీఎం బాషా, గ్యారేజీ కార్యదర్శి బాషా, అసిస్టెంట్ సెక్రటరీలు రాయుడు, జబ్బార్, మున్నా, ఫయాజ్, వరదారెడ్డి, శ్రీధర్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో క్రమశిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప శంకరాపురంలోని స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాలోని స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు బేసిక్, అడ్వాన్స్ శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. ఏడు రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణను స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌కు చెందిన స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బేసిక్ శిక్షణ పొందిన వారే తమ విద్యార్థులకు సక్రమంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్కౌట్ క్రమశిక్షణకు మారుపేరని, ప్రతి విద్యార్థి ఇందులో చేరాలన్నారు. స్కౌట్ సర్టిఫికెట్లు కలిగిన విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని స్కౌట్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎల్‌ఓసీలు వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, స్టాఫ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిని మెరుగుపర్చుకోవాలి


ప్రతిజ్ఞ చేస్తున్న హౌస్‌సర్జన్‌లు


మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమాంబ

- కడప రిమ్స్‌లో ఘనంగా 12 వ స్నాతకోత్సవ వేడుకలు
- స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి. వెంగమాంబ

కడప అర్బన్ : వైద్య వృత్తిని అత్యున్నత ప్రమాణాలతో మెరుగు పర్చుకోవాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమాంబ తెలియజేశారు. శుక్రవారం కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో 12 బ్యాచ్ ఎంబీబీఎస్ 2017లో చేరి, వైద్యవిద్యను పూర్తి చేసిన 175 మంది హౌస్‌సర్జన్‌లకు స్నాతకోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంగమాంబ వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వైద్య విద్యలో నిరంతరం మెలకువలను నేర్చుకోవాలన్నారు. నిబద్ధత, నిజాయితీతో వైద్యవృత్తిని నిర్వహించాలన్నారు. ప్రతి వైద్యుడు తన దగ్గరకు వచ్చే రోగులకు జబ్బులను నయమయ్యేందుకు ఆత్మస్థైర్యాన్ని కూడా కల్పించాలన్నారు. తన ప్రసంగం అనంతరం వైద్య విద్యార్థులచేత వైద్య వృత్తి ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఎన్‌ఎంసీ, నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యుడు, హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లకోసం ప్రతి ఏడాది ఎన్‌ఎంసీ విశేష కృషి చేస్తోందన్నారు. 2012లో దేశవ్యాప్తంగా 37 వేల ఎంబీబీఎస్ సీట్లు వుంటే, 2014కు 47 వేల ఎంబీబీఎస్ సీట్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో 85 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే గతంలో 31 వేల పీజీసీట్లు వుంటే ప్రస్తుతం 64 వేలకు చేరుకున్నాయన్నారు. దేశ వ్యాప్తంగానే గాక, ప్రపంచ వ్యాప్తంగా మనదేశ వైద్యుల ప్రాధాన్యత ఎంతో వుందన్నారు. దేశంలో కరోనా తాండవించిన సమయంలో ముఖ్యంగా ప్రభుత్వ వైద్య అసుపత్రులు, కళాశాలల నుంచి చేసిన సేవలు ఎంతో గర్వించదగినవిగా వున్నాయన్నారు. భవిష్యత్తులో కూడా మన భారతదేశ వైద్యులకు ఎంతో ప్రాముఖ్యత వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నారాయణ వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రశేఖర్, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్) డాక్టర్ ఎస్.లక్ష్మీబాయి, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ టి.లక్ష్మీసుశీల, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో బెటాలియన్ విద్యార్థి

సిద్దవటం : మండల పరిధిలోని భాకారపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన 8వ తరగతి చదవుతున్న సి.ప్రణీత్ కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు కమాండెంటు శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్లో పోలీసుగా పని చేస్తున్న సి.శివప్రసాద్, లక్ష్మీరెడ్డిమ్మ కుమారుడు ప్రణీత్‌కుమార్ ఆంగ్ల భాషలో అక్షరాలు అయిన ఎ నుంచి జెడ్ వరకు 3.30 సెకన్లలో టైప్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారన్నారు. ఈ విషయమై కమాండెంట్ శ్రీనివాసరావు సదరు తల్లిదండ్రులకు, ప్రణీత్‌కుమార్‌లను సత్కరించి మెమెంటోలను అందజేసి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంటు కె. వెంకటరెడ్డి, బెటాలియన్ ఆఫీస్ ఏఓ గులాం దస్తగిరి, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.


ప్రణీత్ కుమార్, కుటుంబ సభ్యులను అభినందిస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు